క్లుప్తంగా

మట్టి విగ్రహాల పంపిణీ



రమణయ్యపేటలో మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్న కోరమాండల్ మహిళా సంఘం సభ్యులు

కాకినాడ రూరల్: స్థానిక రమణయ్యపేటలో మంగళవారం ఫ్రెండ్స్ హెల్పింగ్ హ్యాండ్ ఆధ్వర్యంలో పున్నమరాజు రాజేశ్వరి, హరిణి, మల్లీశ్వరి తదితరులు వినాయక మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. కోరమాండల్ మహిళా సంఘం ఆధ్వర్యంలో సభ్యులు గౌరీ, మల్లీశ్వరి, శ్రీదేవి, మాధవి, రత్నం, మోహిని, అడబాల రత్నప్రసాద్ తదితరులు, వలసపాకల గంగరాజునగర్‌లో లయన్స్ ప్రొఫెషనల్ సభ్యులు రవికుమార్, లయన్ మోహన్‌రావు, లయన్స్‌క్లబ్ కాకినాడ రూరల్ అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ తదితరులు మట్టి వినాయక ప్రతిమలు సుమారు 500 వరకు పంపిణీ చేశారు.

విద్యార్థులకు యూనిఫాం వితరణ



విద్యార్థినులకు యూనిఫాం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 39 ఇంటర్మీడియెట్ విద్యార్థినులకు పూర్వ విద్యార్థి డాక్టర్ మేడిశెట్టి సత్యస్వరూప్ యూనిఫాం పంపిణీ చేశారు. మంగళవారం ఆయన తన తండ్రి అప్పల స్వామి, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలసి రూ.70 వేల విలువైన దుస్తులను అందజేశారు.

విద్యార్థి దశలో ఇంటర్మీడియెట్ కీలకమైందని, సమయాన్ని వృథా చేయకుండా క్రమశిక్షణతో ప్రణాళికాబద్ధంగా చదివి లక్ష్యాలను సాధించాలని ఆయన సూచించారు. ప్రిన్సిపాల్ ఎస్.రాజరాజేశ్వరి మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సహకారంతో పాఠశాలకు వసతులు కల్పించడం అభినందనీయమన్నారు. పూర్వ విద్యార్థులు పేపకాయల మాచరావు (డిప్యూటీ తహసీల్దార్), నక్కా శ్రీనుబాబు, నక్కా భీమశంకర్, పేకేటి దుర్గాప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ దుర్గారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సర్పంచ్ సూర్యప్రకాశరావు

కాకినాడ రూరల్: మండలంలోని నేమాంలో సారా పూర్తిగా అరికట్టి సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని గ్రామ సర్పంచ్ రామదేవు సూర్య ప్రకాశరావు కోరారు. ఎక్సైజ్ శాఖ నార్త్ స్టేషన్ సీఐ రామ్మోహన్‌రావు ఆదేశాలలో ఎస్సై వరహాలు, సిబ్బంది మంగళవారం నవోదయం 2.0 పథకం కింద గ్రామంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు తీసుకుంటున్న చర్యలను ఎస్సై వరహాలు వివరించారు. సర్పంచ్ సూర్య ప్రకాశరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సారాతో పాటు బెల్ట్ షాపులు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

సుముఖా.. శుభప్రదా..

- చవితి ఉత్సవాలకు సర్వం సిద్ధం
- వాడవాడలా మండపాల ఏర్పాటు
- ఆకట్టుకుంటున్న అలంకరణలు

బోట్‌క్లబ్: గణనాథుని నవరాత్రి ఉత్సవాలకు నగరంలోని పలు ప్రాంతాల్లో వైభవంగా ఏర్పాట్లు చేశారు. బుధవారం స్వామివారిని ఆయా మండపాల్లో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేసేందుకు ఆయా కమిటీలు, స్వచ్ఛంద సంస్థలు సమాయత్తమయ్యాయి. ఇళ్లు, దుకాణాలు, వ్యాపార సంస్థలు, ఆటో, లారీ తదితర స్టాండ్లలో స్వామివారి ప్రత్యేక పూజలకు మంగళవారం రాత్రికే అన్నీ సమాయత్తం చేశారు. నగరంలోని వినాయక ఆలయాలతో పాటు, పలు ప్రాంతాల్లో మంటపాలు ఏర్పాటు చేసి విగ్రహాలు నెలకొల్పారు. ఈ నెల 27 నుంచి సెప్టెంబర్ 4 వరకూ చవితి ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక దేవదాయశాఖ డీసీ కార్యాలయంలోని విఘ్నేశ్వర ఆలయంలో చవితి వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. స్థానిక సాలిపేటలోని విఘ్నేశ్వర ఆలయంలోను ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఈఓ ఎం.మురళీవీరభద్రరావు తెలిపారు.

భారీగా విగ్రహాల ఏర్పాటు

నగరంలో పలు ప్రాంతాల్లో భారీ గణనాథుల్ని ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక గోకులంలోను, ఎల్‌బీ నగర్, 50 బిల్డింగ్ సెంటర్, భానుగుడి, బాలాజీ చెరువుసెంటర్, గాంధీనగర్, అశోక్‌నగర్, మెయిన్‌రోడ్డులోని వినాయకుడితో పాటు పలు ప్రాంతాల్లో ప్రత్యేక అలంకరణలతో మండపాలు ఏర్పాటు చేశారు.



గాంధీనగర్ రైతు బజార్ వద్ద పూజా సామగ్రి, పండ్లు, పత్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు



డీసీ కార్యాలయం వద్ద ఉత్సవాలకు సిద్ధమైన సంపత్ విజయ గణపతి ఆలయం



ఒంటిమామిడి సెంటర్‌లో సిద్ధమైన గణనాథుని మండపం

మార్కెట్‌కు చవితి శోభ

నగరంలో ఎక్కడ చూసినా చవితి పండగ శోభ కనిపించింది. స్థానిక భానుగుడి సెంటర్, అశోక్‌నగర్, విద్యుత్‌నగర్, గాంధీనగర్, పెద్ద మార్కెట్, సంతచెరువు, బాలాజీచెరువు సెంటర్, జగన్నాథపురంతో పాటు పలు ప్రాంతాల్లో చవితిపూజకు కావాల్సిన పూజా సామగ్రి, పత్రి, పండ్లు కొనుగోలు చేసేందుకు వినియోగదారులతో రద్దీ కనిపించింది. సాయంత్రం వర్షపు జల్లులు పడడంతో చీకటి పడేవరకూ ప్రజలు పూజా సామగ్రి కొనుగోలుకు ఇళ్ల నుంచి బయటకు రాలేదు. దీంతో మంగళవారం నగరంలో రద్దీ నెలకొంది. గాంధీనగర్, మెయిన్‌రోడ్డు, అశోక్‌నగర్ ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రోడ్డుపైనే పత్రి దుకాణాలు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్‌కు కొంత అంతరాయం ఏర్పడింది.

అనుమతులు తీసుకోవాలి



మండపాలు ఏర్పాటు చేసే వారు విద్యుత్ కోసం విద్యుత్ శాఖ అధికారుల నుంచి, మైక్‌ల వినియోగానికి పోలీస్‌శాఖ అనుమతి తీసుకోవాలి. ఎటువంటి అనుమతులు తీసుకోకుండా రోడ్డుపై మండపాలు పెట్టకూడదు.

– వడ్డి ఫణీంద్రకుమార్, దేవదాయశాఖ కాకినాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్

మట్టి విగ్రహాలకు ప్రాధాన్యం

పర్యావరణ పరిరక్షణకు ఈ ఏడాది అధికంగానే ప్రాధాన్యం ఇస్తున్నారు. మండపాల్లో ఏర్పాటు చేసే భారీ విగ్రహాలతో పాటు, ఇంటి వద్ద పూజించే గణనాథుడికి విగ్రహాలను మట్టితోనే తయారుచేయించుకుని వినియోగిస్తున్నారు. పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఇప్పటికే ఉచితంగా వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు. రోటరీ, లయన్స్‌క్లబ్, ధరిత్రి రక్షణ సమితితో పాటు పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి గణనాథుల విగ్రహాలు పంపిణీ చేస్తున్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు శిక్షణ



బోట్‌క్లబ్ ఉద్యానవనంలో తెర చాపను బిగించి, పడవను సిద్ధం చేస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

కాకినాడ రూరల్: వచ్చేనెల ఒకటో తేదీ నుంచి పదో తేదీ వరకు ఒడిశాలో జరగనున్న ఎంఈఎస్‌యూ–2025లో పాల్గొనేందుకు ఎన్‌సీసీ క్యాడెట్లు 20 మంది బోట్‌క్లబ్ ఉద్యానవన చెరువులో శిక్షణ పొందుతున్నారు. ఈ నెల 18 నుంచి శిక్షణ ప్రారంభించామని నెలాఖరు వరకు ఉంటుందని కాకినాడ యూనిట్ 6 ఆంధ్ర నావల్ ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కమాండర్ అజయ్ యాదవ్ పేర్కొన్నారు. శిక్షణలో భాగంగా చెరువులో పడవ లాగడం, తెర చాపను బిగించి ఏర్పాటు చేయడం (పడవ రిగ్గింగ్), తాళ్లతో పడవను లాగేందుకు ముడులు వేయడం, భౌతిక సామర్థ్యం, నాయకత్వ లక్షణం పెంపొందించడం తదితర అంశాలపై తర్ఫీదు ఇస్తున్నట్టు తెలిపారు. శిక్షణ అనంతరం ఒడిశాలో జరిగే కార్యక్రమంలో పోటీ పాల్గొంటారన్నారు.

ప్రజలకు ఇబ్బంది కలిగించొద్దు

- గణేష్ ఉత్సవ కమిటీలకు అధికారుల పిలుపు



ఉప్పలంక వద్ద నిమజ్జన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కరప: ప్రజలకు ఇబ్బంది లేకుండా గణేష్ మండపాలు ఏర్పాటు చేయాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రశాంత వాతావరణంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించాలని తహసీల్దార్ తుమ్మల దుర్గాప్రసాద్, కరప ఎస్‌ఐ టి.సునీత ఉత్సవ కమిటీలను కోరారు. మండల పరిధిలోని గ్రామాలను మంగళవారం వారు పర్యటించి గణేష్ మండపాలను, నిమజ్జనం చేసే అరట్లకట్ట, పెనుగుదురు, ఉప్పలంక, గొర్రిపూడి, వేములవాడ, వేళంగి గ్రామాల్లోని పంట, మురుగు కాలువల్లోని రేవులను పరిశీలించారు. గణేష్ విగ్రహాలను నెలకొల్పేందుకు ఎటువంటి చలానాలు చెల్లించనవసరంలేదని, ఆన్‌లైన్‌లో అనుమతి తీసుకోవాలన్నారు. నాలుగు అడుగులు దాటిన విగ్రహాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండపాలు రహదారులకు ఆటంకంలేకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండపాల వద్ద రాత్రి సమయంలో ముగ్గురు వలంటీర్లు కాపలాగా ఉండాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జూదాలు, అశ్లీల నృత్యాల వంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల మధ్య లౌడ్‌స్పీకర్లు నిషిద్ధమన్నారు. నిమజ్జనంలో నీటి ప్రమాదాలు జరగకుండా నిర్వాహకులు దగ్గరుండి నిర్దేశించిన మార్గంలో ఊరేగింపులు జరిపి, నిమజ్జనం చేయాలని గ్రామాల్లోని ఉత్సవ కమిటీలను కోరారు. మండలంలోని 23 గ్రామాల నుంచి గణేష్ ఉత్సవాల నిర్వహణకు 139 దరఖాస్తులు వచ్చాయని ఎస్‌ఐ సునీత తెలిపారు. ఆర్‌ఐ పవన్ ఆయా గ్రామాల వీఆర్వోలు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

శ్రామిక పక్షపాతి రాజగోపాల్

బోట్‌క్లబ్: శ్రామిక వర్గ పక్షపాతిగా జీవితకాలం వారికోసం తపించిన ధన్యజీవి ఎం.రాజగోపాల్ అని వక్తలు కొనియాడారు. సీపీఎం నాయకులు ఎం.రాజగోపాల్ ఐదో వర్ధంతి సభ స్థానిక సుందరయ్య భవన్‌లో పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. సభలో వక్తలు మాట్లాడుతూ జీవిత బీమా సంస్థలో ఉద్యోగం చేస్తున్న కాలంలో ఆ సంఘం నాయకుడిగా కృషి చేసి ఉద్యోగ విరమణ అనంతరం సకల శ్రామిక వర్గం ప్రయోజనాల కోసం పనిచేసిన ధన్యజీవని కొనియాడారు. వ్యక్తిగత జీవితంలో ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనడం, కోవిడ్ సమయంలో పార్టీ శ్రేణులను ఆదుకోవడం, యువ కార్యకర్తలను ఉద్యమాల వైపు ప్రోత్సహించడం తదితర కార్యక్రమాలలో ముందుండేవారని గుర్తు చేస్తున్నారు. రాజగోపాల్ అనుసరించిన మార్గాన్ని దీక్షతో కొనసాగిస్తూ సమ సమాజ స్థాపనకు పని చేయడమే రాజగోపాల్‌కు నిజమైన నివాళి అన్నారు. ముందుగా రాజగోపాల్ చిత్రపటానికి పార్టీ నాయకులు పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎం.రాజశేఖర్, కె.ఎస్. శ్రీనివాస్, పార్టీ కాకినాడ రూరల్ కమిటీ కార్యదర్శి తిరుమలశెట్టి నాగేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకులు పెద్దింశెట్టి రామకృష్ణ, సీహెచ్ అజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా మదర్ థెరిసా జయంతి



తూరంగిలో పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న పీస్ సభ్యులు

బోట్‌క్లబ్/కరప/కాకినాడ రూరల్: మదర్ థెరిసా జయంతిని పీస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. తూరంగిలోని క్రైస్తవ కమ్యూనిటీ హాలులో పీస్ సేవా సంఘం ఫౌండర్ మండవ దైవసమాధానం ఆధ్వర్యంలో పేదలకు నూతన వస్త్రాలు, దుప్పట్లు, రగ్గులు, పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బలగం ప్రసన్నకుమార్, స్థానిక పెద్దలు బండారు నాగేశ్వరరావు, కొల్లాబత్తుల బ్రహ్మస్వామి తదితరులు పాల్గొన్నారు. అలాగే కరప మండలం విజయరాయుడుపాలెంలో సర్పంచ్ వెలుగుబంటి సీతారామ రాఘవ, కరప ఎస్‌ఐ టి.సునీత, ఉప సర్పంచ్ బూలా శారద తదితరులతో కలసి దైవసమాధానం నివాళులర్పించారు. మాతా అప్పారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో 120 మంది పేదలకు దుస్తులు, పండ్లు అందజేశారు. అలాగే రూరల్ మండలంలో మదర్ థెరిస్సా విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ సర్పంచ్ బలగం ప్రసన్నకుమార్, ఎస్.రఘుయేలు తదితరులు పేదలకు దుస్తులు పంపిణీ చేశారు.

పారిశ్రామిక, విద్యారంగ మార్పులను గమనించాలి

- అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ ఎలీప్ వీహబ్ చీఫ్ డాక్టర్ జహురుల్లా



జహురుల్లా ఎస్ఎండీని సత్కరిస్తున్న వీసీ ప్రసాద్, డైరెక్టర్ గోపాలకృష్ణ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): అధ్యాపకులు, విద్యార్థులు నిరంతరం పరిశ్రమ, విద్యారంగంలో వస్తున్న మార్పులను గమనించాలని అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ ఎలీప్‌వీహబ్ చీఫ్ డాక్టర్ జహురుల్లా ఎస్ఎండీ పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ ఎలీప్‌వీహబ్, నీతి అయోగ్, మైటీ స్టార్టప్ హబ్ సహకారంతో ఇండస్ట్రీ 4.0, 5.0 సాంకేతిక పరిజ్ఞానం, యాక్సలరేషన్ సహాయం అనే అంశంపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జహురుల్లా ఎస్ఎండీ తన 17 ఏళ్ల అనుభవాన్ని పంచుకుంటూ పరిశ్రమలు, పరిశోధన విద్యారంగంలో వచ్చిన మార్పులను యువతకు వివరించారు. ఇండస్ట్రీ 4.0 ప్రాముఖ్యత, స్టార్టప్‌లకు అందే సహకారం, నైపుణ్యాభివృద్ధి అంశాలపై వివరించారు. జేఎన్‌టీయూకే వీసీ సీఎస్ఆర్‌కే ప్రసాద్ మాట్లాడుతూ విద్యాసంస్థల్లో కేవలం బోధన, పరిశోధన పరిమితులే కాకుండా ఆవిష్కరణ, వినూత్న ఆలోచనల ద్వారా విద్యార్థులు, అధ్యాపకులు ప్రామాణికతతో కూడిన పరిశోధనకు ప్రోత్సాహం ఇవ్వాలన్నారు. అనంతరం జహురుల్లా ఎస్ఎండీని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇన్నోవేషన్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎ.గోపాలకృష్ణ, ప్రొఫెసర్ కృష్ణప్రసాద్, రామలింగరాజు పాల్గొన్నారు.


ఎంపీడీఓకు రెడ్‌క్రాస్ పురస్కారం


సామర్లకోట: స్థానిక మండల ప్రజాపరిషత్ అధికారి కె.హిమమహేశ్వరి రెడ్‌క్రాస్ అవార్డును అందుకున్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన రెడ్‌క్రాస్ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. రెడ్‌క్రాస్ ద్వారా నిర్వహించిన కార్యక్రమాలకు ఉత్తమ సేవలు అందించడంతో ఆమెకు సిల్వర్ మెడల్ దక్కింది. కలెక్టరు షణ్మోహన్ ఆమెకు పతకాన్ని బహూకరించి అభినందించారు. ఈ మేరకు ఆమెను ఈఓపీఆర్డీ భైరవమూర్తి, ఏఓ బి.సతీష్ ఇతర సిబ్బంది అభినందించారు.



ఎంపీడీఓకు పురస్కారాన్ని అందజేసి అభినందిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

శ్రీపాద శ్రీవల్లభునికి సహస్ర గులాబీలతో అర్చన





ప్రత్యేక అలంకరణలో వినాయకుడు, శ్రీపాద శ్రీవల్లభ స్వామి

పిఠాపురం: స్థానిక శ్రీపాద శ్రీ వల్లభ మహా సంవస్థానంలోని శ్రీపాద శ్రీవల్లభ స్వామి వారి సప్తాహ మహోత్సవాలు ఆరు రోజులుగా వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం స్వామివారికి సహస్ర గులాబీలతో అర్చన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అధికారులు భక్తులుకు అన్నప్రసాదాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక హోమాలు, అర్చనలు నిర్వహిస్తున్నట్లు ఈఓ ఆర్.సౌజన్య తెలిపారు. వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని ఈ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కిఫ్ట్‌లో చవితి ఉత్సవాలు



కిఫ్ట్ విద్యార్థులు తయారు చేసిన వినాయకుడి విగ్రహం

బోట్‌క్లబ్: స్థానిక కిఫ్ట్ ఫ్యాషన్ కళాశాలలో మంగళవారం వినాయక చవితి ఉత్సవాలను కళాశాల కరస్పాండెంట్ కె.కృష్ణవేణి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కళాశాల విద్యార్థులు తమ సృజనాత్మకతతో పర్యావరణ హిత గణేశ విగ్రహాలను వివిధ రాష్ట్రాల సాంప్రదాయ దుస్తుల్లో ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. గుజరాత్, కేరళ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, గోవా, పశ్చిమబెంగాల్, కర్ణాటక రాష్ట్రాల్లో ఏ విధంగా వినాయకుడి తయారు చేస్తారో అలాగే అలంకరించి అందరినీ ఆకట్టుకున్నారు.

ఈ విగ్రహాలను సహజ మట్టి, రంగులతో తయారు చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ విగ్రహాలు, రంగులు పర్యావరణానికి ఎటువంటి హాని చేయవన్నారు. తమ విద్యార్థులు ఫ్యాషన్ డిజైన్‌లోనే కాకుండా పర్యావరణ పరిరక్షణలో కూడా సృజనాత్మకతను చూపిస్తున్నారన్నారు. భారతీయ సాంస్కృతిక వైవిధ్యాన్ని ఒకే వేదికపై ప్రతిబింబించే ఈ ఆవిష్కరణ ఎంతో గర్వకారణమన్నారు.

అవగాహనతోనే ప్రమాదాలకు దూరం

సామర్లకోట: ప్రతి కార్యక్రమంపై పూర్తి అవగాహన ఉన్నపుడు ప్రమాదాలను నివారించవచ్చని సీఐ ఎ.కృష్ణభగవాన్ అన్నారు. మంగళవారం సాయంత్రం హుస్సేన్‌పురంలో ఏర్పాటు చేసిన వినాయక చవితి అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఆయా సెంటర్లలో గణపతి శిబిరాలు ఏర్పాటు చేసే సభ్యులు కమిటీగా ఏర్పడి మండపాల నిర్వహణ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు సమయంలో వచ్చే క్యూఆర్ కోడ్‌ను శిబిరాల వద్ద ఉంచాలని, తమ సిబ్బంది దానిని ప్రతిరోజూ తనిఖీ చేస్తారని వివరించారు. ఆయా శిబిరాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా కమిటీదే బాధ్యత అని హెచ్చరించారు. గ్రామ నాయకులు చల్లా బుజ్జి, మార్ని సూర్యారావు, కోట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన పురుగు మందులు విక్రయించొద్దు

కొత్తపల్లి: పురుగు మందులు కొనుగోలు చేసిన రశీదులను భద్రపరుచుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి జోగిరాజు సూచించారు. మండలంలోని యండపల్లిలోని పురుగు మందుల షాపును మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అధికంగా అమ్ముడయ్యే పురుగుమందుల నమూనాలను సేకరించారు. రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయి అధికారుల ఆదేశాల మేరకు మండలంలోని ఎరువుల దుకాణాల్లో పురుగుమందుల నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపుతున్నట్లు తెలిపారు. అనుమతులు లేని, కాలం చెల్లిన పురుగు మందులను విక్రయిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

వీవోఏల మండల మహాసభ

కొత్తపల్లి: స్థానికంగా ఉన్న మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం మండల వీఓఏల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా ఎస్. నిర్మల, కార్యదర్శిగా సుశీల, కోశాధికారిగా ప్రసాద్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం కార్యదర్శి అప్పారెడ్డి, మండల సీఐటీయూ అధ్యక్షుడు నాగేశ్వరరావు, కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద కళాశాల ఏర్పాటుకు కృషి

బాలాజీచెరువు: కాకినాడలో ఆయుర్వేద కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు ఎంపీ తంగేళ్ల ఉదయ్‌శ్రీనివాస్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. జీజీహెచ్ ఆవరణలోని 50 పడకల ఆయుష్ వైద్యశాలకు కొనసాగింపుగా కళాశాల నిర్మాణానికి కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి ప్రకాష్‌రావు జాదవ్‌కు లేఖ రాయగా స్పందించి ప్రతిపాదనలు పంపిచాలని సూచించారన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం 16.40 కోట్ల ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు.

తీరంలో అలజడి

- ఎగసి పడుతున్న అలలు
- భారీగా కురుస్తున్న వర్షం

కొత్తపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మంగళవారం సముద్ర తీరంలో అలలు ఎగసి పడుతున్నాయి. సముద్ర అలలు ఎగసి పడడంతో తీరప్రాంతం కోతకు గురవుతోంది. బీచ్‌రోడ్డుకు రక్షణగా వేసిన రాళ్లగోడను సైతం దాటుకుని అలలు ఎగసి పడుతున్నాయి. దీంతో బీచ్‌రోడ్డులో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే మత్స్యకారుల గృహాలు కోతకు గురి కావడంతో వారు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.



ఉప్పాడ తీరప్రాంతంలో ఎగసి పడుతున్న అలలు

భారీ వర్షం

మండలంలో కురుస్తున్న భారీ వర్షానికి జన జీవనం స్తంభించింది. ప్రధాన రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. పలు ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచిపోయింది.



ప్రమాదకరంగా మారిన ఉప్పాడ బీచ్ రోడ్డు



ఉప్పాడలో కోతకు గురైన మత్స్యకార గృహాలు